క్లుప్తంగా

ప్రతీ దరఖాస్తుకు పరిష్కారం

పాల్వంచరూరల్: గ్రామసభల్లో గిరిజన ప్రజలు చేసుకున్న ప్రతీ దరఖాస్తుకు పరిష్కారం లభిస్తుందని ఎంపీడీఓ కె.విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. తోగ్గూడెం గ్రామంలో మంగళవారం ధర్తీ ఆబజన్ భగీధరి అభియాన్ గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు గ్రామసభలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రతీ సమస్యను పీఓ దృష్టికి తీసుకెళ్లి, సంబంధితశాఖల అధికారులకు పంపి పరిష్కారం చేయనున్నట్లు చెప్పారు. ఏపీఓ పొరండ్ల రంగా, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: ఖమ్మం జిల్లాలో వైరా మండలం సిరిపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి పోస్టాఫీసు సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. మాట్లాడుతూ.. కేజీ సిరిపురం గ్రామ ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గంధం మల్లికార్జున్, వీరు నాయక్, అల్లకొండ శరత్, ధనుంజయ్, సోను, జైసింగ్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పాఠశాల గోదాం సీజ్

పాల్వంచ: అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే ఫహీమ్‌ఖాన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన నిర్వహించారు. పాఠశాల నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా ఉందని డీఈఓ వెంకటేశ్వరచారికి సమాచారం అందించారు. దీంతో ఎంఈఓ శ్రీరామ్మూర్తి పాఠశాల వద్దకు చేరుకుని స్టేషనరీ, యూనిఫాం ఉంచి రూంను సీజ్ చేశారు. కార్యక్రమంలో అజిత్, గుండాల సుజన, పవన్ సాయి, నాగేంద్రబాబు, వినయ్, వంశీ, మహేశ్, కల్యాణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

స్వేరోస్ కమిటీ ఎన్నిక

కొత్తగూడెంఅర్బన్: స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ మంగళవారం జిల్లా నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నరాల రాజేష్, ఇతర సభ్యులను నియమించారు.

వ్యాధుల కట్టడిపై అవగాహన

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొత్తగూడెం సంపూర్ణ సురక్ష ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో టీబీ, సుఖవ్యాధులపై ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవగాహన నిర్వహించారు. కేంద్రం మేనేజర్ ప్రియాంక, సూపర్‌వైజర్ ప్రమీల హెచ్ఐవీ హెపటైటిస్, సిఫిలిస్, గనేరియా, ఎస్టీడీఎస్ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆశా కార్యకర్తలు గ్రామస్థాయిలో వెళ్లి ఈ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేశ్వర్లు, సీహెచ్ఓ రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీలు రాధిక, ప్రియదర్శిని, టీబీ సూపర్‌వైజర్ రఫేల్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

ఇల్లెందురూరల్: రొంపేడు పీహెచ్‌సీ పరిధిలోని గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో వైద్యసిబ్బంది మంగళవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కవిత మాట్లాడుతూ.. ప్రస్తుతం దోమల ఉత్పత్తికి అనుకూల సమయమని, దోమలను లార్వా దశలోనే నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశ్రమంలో ఆరుబయట వృథా నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఖాళీ పాత్రలు, ప్లాస్టిక్ డబ్బాలు వంటి వాటిలో వర్షపు నీరు నిలిచి దోమల ఉత్పత్తికి కారణమవుతాయని వివరించారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల సిబ్బందితోపాటు విద్యార్థులు కూడా దోమల నివారణ చర్యలకు ఉపక్రమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో భద్రు, సిబ్బంది పాల్గొన్నారు.

టెం'డర్' దాఖలుకు వెనుకంజ

- బిల్లులపై అనుమానం
- ముఖం చాటేస్తున్న కాంట్రాక్టర్లు
- తూములు, కాల్వలు ఛిద్రమై చెరువులన్నీ ఆగమాగం
- కాలం తరుముకొస్తోందని రైతుల్లో ఆందోళన



సుదిమళ్ల పెద్దచెరువు



మట్టిలో పూడిపోయిన తూముషట్టరు

ఇల్లెందురూరల్: నిధులు మంజూరైతే చాలు.. పనులను దక్కించుకునేందుకు కాంట్రాక్టర్లు పోటీ పడుతుంటారు. టెండర్ తమకే దక్కేలా చూడాలని ప్రజాప్రతినిధుల చుట్టూ చక్కర్లు కొడుతుంటారు. కానీ ఇరిగేషన్ శాఖలో నిధులు మంజూరైన పనులకు పలుమార్లు టెండర్లు పిలిచినా ఒక్కరూ దాఖలు చేయడం లేదు. పైపెచ్చు టెండర్ వేయాలని ఎక్కడ ఒత్తిడి చేస్తారోనన్న అనుమానంతో కాంట్రాక్టర్లు సంబంధిత అధికారులకు ముఖం చాటేస్తున్నారు. దీంతో కాలం తరుముకొస్తున్న వేళ అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

చెరువులన్నీ ఆగమాగం..

సుమారు ఐదేళ్లుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెరువులన్నీ ప్రస్తుతం ఆందోళనకరంగా ఉన్నాయి. మండలంలో అతిపెద్ద చెరువులలో ఒకటైన చల్లసముద్రం పెద్దచెరువు కాల్వలు, తూములు ఛిద్రమయ్యాయి. ప్రధాన తూము షట్టర్‌కు రంధ్రాలు పడటంతో చెరువులో నీరు నిల్వ ఉండే పరిస్థితి లేదు. గోపాలరావు చెరువు తూము పైపులు పగిలిపోయాయి. చెరువులోకి వరదనీరు చేరుకున్నా తూము సరిగా లేకపోవడంతో పంట చేలకు నీరందే పరిస్థితి లేదు. ఇల్లెందు ఏజెన్సీ పల్లెలకు గుండెకాయ లాంటి గుట్టల చెరువు, మస్సివాగు కట్ట చెరువుల పరిస్థితి దయనీయంగా ఉంది. కాల్వలు, తూము మరమ్మతులు చేయకపోతే చెరువులలో నీరు నిల్వ ఉండే పరిస్థితి ఉండదు. సుదిమళ్ల పెద్దచెరువు తూము షట్టర్లు మట్టిలో పూడిపోయాయి. కాల్వలు అధ్వానంగా ఉన్నాయి. ఇలా చిన్న, పెద్ద చెరువులు అనేకం ప్రస్తుత వానాకాలం సీజన్‌లో తక్షణం మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని అటు అన్నదాతలు, ఇటు ఇరిగేషన్‌శాఖ అధికారులు గుర్తించారు.

నిధులు మంజూరైనా..

చెరువుల పరిస్థితిని గుర్తించిన ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణం మరమ్మతులు చేయాల్సిన చెరువులను గుర్తించి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అంతే వేగంగా ఉన్నతాధికారులు స్పందించి నిధులు కూడా మంజూరు చేశారు. దీనిప్రకారం మండలంలోని ధనియాలపాడు పంచాయతీలోని గోపాల్‌రావు చెరువు తూము, షట్టర్ మరమ్మతులకు రూ.5.94 లక్షలు, పూబెల్లి గ్రామపంచాయతీ జామెల్లకుంటకు రూ.8.14 లక్షలు, కొమరారం గ్రామపంచాయతీ గుట్టల చెరువుకు రూ.8.15 లక్షలు, మాణిక్యారం గ్రామపంచాయతీ మస్సివాగుకట్ట చెరువుకు రూ.1.53 లక్షలు చల్లసముద్రం పెద్దచెరువు మరమ్మతులకు రూ.7.79 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసి నెల రోజులు గడిచింది. కానీ పనులు ప్రారంభానికి ముహూర్తం కుదరడం లేదు.

కాంట్రాక్టర్లలో టెం'డర్'..

పల్లెల్లో సీసీ రోడ్లు, కాల్వలు, భవన నిర్మాణాల వంటి ఇతరత్రా నిర్మాణాలకు సంబంధించిన పనులను దక్కించుకునేందుకు కాంట్రాక్టర్లు పోటీ పడుతుంటారు. బిల్లులు నాలుగు రోజులు ఆలస్యమైనా ఫర్వాలేదు.. ముందు పనులు కానిచ్చేస్తాం.. అంటూ పైరవీల ద్వారా పనులు దక్కించుకొని చూస్తుండగానే పనులు పూర్తి చేస్తారు. ఇక చెక్‌డ్యాంలు, వంతెనలు, బీటీ రోడ్లు వంటి పనులకు పోటీ పడి టెండర్లు దాఖలు చేస్తుంటారు. కొన్ని సందర్భాలలో భారీ లెస్‌కు కూడా ఉత్సుకత చూపుతుంటారు. కానీ చెరువుల వద్ద మరమ్మతు పనులు అనేసరికి కాంట్రాక్టర్లు భయంతో వెనుకంజ వేస్తున్నారు. దీనికి బిల్లుల చెల్లింపులో జాప్యం చోటుచేసుకుంటుందన్న భయమో.. లేక తక్కువగా వస్తుందనే అనుమానమో.. ఏదేమైనా మండలంలో రూ.35 లక్షలతో చెరువుల మరమ్మతు పనులకు ఒక్కరు కూడా టెండర్ దాఖలు చేసేందుకు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం ఆరుద్ర కార్తె ప్రారంభం కావడంతో వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని ఆశిస్తున్న అన్నదాతలకు చెరువుల పరిస్థితి ఆందోళనకు గురిచేస్తోంది. ఇటువంటి పరిస్థితిలో కాంట్రాక్టర్లను పురమాయించి టెండర్లు దాఖలు చేసేలా అధికారులు ప్రయత్నం చేయకపోవడంతో అన్నదాతలకు శాపంగా పరిణమిస్తోంది.

టెండర్లు పిలిచినా రాలేదు..



మండలంలో కొన్ని చెరువులకు తక్షణ మరమ్మతులు అవసరమై ఉన్నతాధికారుల ద్వారా నిధులు మంజూరు చేయించుకున్నాం. పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానిస్తూ ఇప్పటికే మూడుసార్లు నోటిఫికేషన్లు ఇచ్చాం. అయినా టెండర్లు దాఖలు చేసేందుకు ఒక్కరూ ముందుకు రావడం లేదు. సమస్యను ఉన్నతాధికారులకు వివరించి పరిష్కారమార్గం చూస్తాం.

– భాగ్యరాజ్, డీఈ, ఇరిగేషన్

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

జూలూరుపాడు: రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలందరీ ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచానని, తనకు ఎలాంటి రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారులు ఏమీ లేవని ప్రజా సేవ చేయడమే తన జీవిత లక్ష్యమన్నారు. సీతారామ ప్రాజెక్టు నీటితో జూలూరుపాడు మండలంలోని చెరువులను నింపనున్నట్లు తెలిపారు. వైరా నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, మరో రెండువేలు వస్తాయన్నారు. జూలూరుపాడు మండలానికి 565 ఇళ్లు మంజూరు చేశామని, పైలట్ ప్రాజెక్టు కింద అనంతారం గ్రామానికి 80 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం స్లాబ్ దశలో ఉన్నట్లు చెప్పారు. అనంతరం 260 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అర్జున్‌రావు, లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, అల్లాడి నరసింహారావు, కాట్లూరు వెంకటేశ్వరరావు, కంచర్ల హరీష్, మధుసూదన్‌రావు, పొన్నెకంటి సతీష్, రోకటి సురేష్, వేల్పుల నరసింహారావు, బానోత్ లాలు నాయక్, బానోత్ నవీన్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గుగనుల రక్షణకై, కొత్తగనుల ఏర్పాటుకు జూలై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సింగరేణి ఐక్యవేదిక కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెంలోని ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్మికుల ప్రయోజనాలకు తోడ్పడుతున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగులేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. బొగ్గుగనుల అమ్మకాలను రద్దు చేయాలని, కొత్త గనులకు అనుమతి ఇవ్వాలని, ఉద్యోగాలు లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం తీర్పు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ హక్కుల సాధనకు సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వటం జరిగిందన్నారు.

సమ్మె నోటీసు అందజేత...

జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెపై ఏరియా జీఎం శాలేంరాజుకు మంగళవారం సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. మాట్లాడుతూ.. ప్రభుత్వరంగ పరిశ్రమల అమ్మకం, సింగరేణి ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మే 20న జరగాల్సిన ఈ సమ్మె మే 15న న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో జూలై 9కి వాయిదా వేయటం జరిగిందన్నారు. సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విజయగిరి శ్రీనివాస్, వైవీ రావు, గడల నర్సింహారావు, పీవీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రౌడీషీటర్‌పై నిఘా ఉంటుంది..

కొత్తగూడెంటౌన్: ప్రతీ రౌడీషీటర్ ప్రజలతో జాగ్రత్తగా మెలగాలని, ఎలాంటి ఇబ్బందులు కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని రామవరం టూటౌన్ సీఐ ప్రతాప్ హెచ్చరించారు. మంగళవారం రామవరంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ ప్రతాప్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సింగరేణి సంస్థకు అనుబంధంగా ఉన్న ప్రాంతాలు కావడంతో ఇక్కడ దొంగలు ఎక్కువగా ఉన్నారని, అదే విధంగా రౌడీ షీటర్లు అధికంగా ఉన్నట్లు చెప్పారు.

రౌడీషీటర్లందరిపై నిఘా ఉంటుందని, వారి ప్రవర్తనను మార్చుకోవాలని, అసాంఘిక శక్తులతో కలిసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



టేకులపల్లి మార్కెట్ యార్డులో మొక్కలు నాటుతున్న చైర్మన్, కార్యదర్శి, నాయకులు

ఇల్లెందు: ఖాళీ ప్రదేశంలో మొక్కలు నాటుదామని, నేడు నాటిన మొక్కలు చెట్టై నీడ, పూలు, పండ్లను ఇస్తాయని మార్కెట్ కమిటీ సెక్రెటరీ ఇ.నరేష్ అన్నారు. మంగళవారం ఇల్లెందు మార్కెట్ యార్డు ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాంబాబు, సెక్రెటరీ నరేష్, జింకు, శ్రీనివాసరావు, రంజిత్, లక్ష్మి, విజయ, మోహన్‌రావు, హరికృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అందరూ మొక్కలు నాటాలని ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు అన్నారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లిలోని మార్కెట్ యార్డు ఆవరణలో మొక్కలు నాటి హరితహారం కార్యక్రమం నిర్వహించారు. నాటిన మొక్కలను విధిగా సంరక్షించాలని పేర్కొన్నారు. మానవ జీవులకు ప్రాణవాయువు ఇచ్చే వృక్షాలను నరకకుండా కాపాడాలని కోరారు. లో ఏఎంసీ గ్రేడ్3 కార్యదర్శి ఇ.నరేష్‌కుమార్, కోరం సురేందర్, దేవా, బాలాజీ, ఎస్.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన నాయకులు

నెహ్రూ మంత్రివర్గంలో భారత మొదటి వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి, న్యాయవాది, విద్యావేత్త, రాజకీయ వేత్త డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో తేజావత్ శంభునాయక్, వాంకుడోత్ హత్తీరామ్ నాయక్, బాలాజీ నాయక్, సంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో కారుణ్య నియామకాల కోసం మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లల కోసం మంగళవారం తొమ్మిది మందికి పీవీకే–5 ఇంక్లైన్ గనిలో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఏరియా ఏజెంట్ బీ.రవీందర్, డీజీఎం పర్సనల్ వెంకటమోహన్‌రావు, గని మేనేజర్ శ్యాం ప్రసాద్, పర్సనల్ మేనేజర్ మురళీ, సంక్షేమాధికారి షకీల్ పాల్గొన్నారు.

మద్యం సిండికేట్‌పై చర్యలు తీసుకోవాలి

పాల్వంచరూరల్: మద్యం వ్యాపారులు సిండికేట్గై నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులకు మద్యాన్ని సరఫరా చేస్తూ అధిక ధరలకు విక్రయించి వినియోగదారులను నిలువు దోపిడీ చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు స్థానిక ఎక్సైజ్‌శాఖ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వైన్‌షాపుల నిర్వాహకులు సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి అర్ధరాత్రి వరకు నడుపుతున్నారని, పట్టణంలో 13 వైన్ షాపులు ఉంటే వందకు పైగా బెల్టుషాపులు నడుస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. బత్తుల వెంకటేశ్వర్లు, మాదారపు లక్ష్మణ్‌రావు, గుండు రాజు, శ్రీనివాసనాయుడు, పవన్, అశోక్, సాగర్, సత్యం, మంగీలాల్, వెంకటరమణ, ఉమ, నాగలక్ష్మి, రమాదేవి ఉన్నారు.

ప్రపంచశాంతిని నెలకొల్పాలి



సూపర్‌బజార్(కొత్తగూడెం): నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పశ్చిమాసియాపై సామ్రాజ్యవాద ఆధిపత్యం చెలాయించడానికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దేశాల మధ్య చిచ్చు పెడుతూ యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాడని వామపక్ష పార్టీ నాయకులు విమర్శించారు. అఖిల భారత వామపక్ష పార్టీల దేశవ్యాపిత నిరసన కార్యక్రమాలలో భాగంగా మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.. తక్షణమే యుద్ధాలకు స్వస్తి చెప్పి ప్రపంచ శాంతిని నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సలిగంటి శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, ముద్దా భిక్షం, గౌని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇల్లెందు: అమెరికా సామ్రాజ్యవాద దురాక్రమణదాడులు పరోక్షంగా, ప్రత్యక్షంగా పెచ్చరిల్లిపోతున్నాయని, పాలస్తీనా, ఇరాన్‌లలో ఇజ్రాయిల్ ద్వారా వరుస దాడులు కొనసాగుతున్నాయని ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, మాస్‌లైన్ జిల్లా నాయకులు నాయిని రాజు, సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబీలు తీవ్రంగా ఆక్షేపించారు. మంగళవారం ఇల్లెందులో వామపక్షాల పిలుపులో భాగంగా భగత్‌సింగ్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించి ఆందోళన చేపట్టారు. మాట్లాడుతూ.. తక్షణమే దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. బుర్ర వెంకన్న, బోస్, కాంపాటి పృథ్వీ పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాద దాడిని ప్రజలంతా ఖండించాలని వామపక్ష పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులను నిరసిస్తూ మంగళవారం జూలూరుపాడులో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ, సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ఎన్డీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులతో అమెరికా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేక నినాదాలు చేశారు. కార్యక్రమంలో బానోత్ ధర్మా, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, యాసా నరేష్, వల్లోజి రమేష్, వై.గోపాల్‌రావు, ఎస్కే చాంద్‌పాషా, నాగరాజు, బచ్చల లక్ష్మయ్య పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలు చేద్దాం..

టేకులపల్లి: పేద, బడుగు బలహీన వర్గాలకు ఎర్ర జండా అండగా ఉంటుందని సీపీఐ జిల్లా నాయకుడు గుగులోత్ రామ్‌చందర్ నాయక్ అన్నారు. మంగళవారం పెట్రాంచెలక స్టేజీ, బొమ్మనపల్లి, బిల్లుడుతండా, చింతలంక శాఖల మహాసభలకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అర్హులైన నిరుపేదలకు రాజకీయ జోక్యం లేకుండా అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం నూతన గ్రామశాఖల కమిటీలను ప్రకటించారు. పెట్రాంచలక స్టేజీ శాఖ కార్యదర్శిగా బాదావత్ రాందాస్, సహాయ కార్యదర్శిగా గుగులోత్ మంగ్యా, బొమ్మనపల్లి శాఖ కార్యదర్శి కార్యదర్శిగా దేగల రమేష్, సహాయ కార్యదర్శిగా కొరుకొప్పల వెంకటేశ్వర్లు, బిల్లుడు తండా శాఖ కార్యదర్శిగా భూక్యా మోతి, సహాయ కార్యదర్శిగా బానోతు విజయ, చింతలంక శాఖ కార్యదర్శిగా జోగా కృష్ణవేణి, సహాయ కార్యదర్శిగా నాగేంద్రబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పొదుపు సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాలలోని సభ్యులు సమష్టితత్వంతో ఆర్థికాభివృద్ధి సాదించాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సంఘాల నూతన పాలకవర్గ సభ్యులకు మంగళవారం ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. మాట్లాడుతూ.. సెర్ప్ నిబంధనలకు అనుగుణంగా మండలలోని 87 గ్రామ సంఘాలకు నూతన పాలకవర్గాలు ఏర్పడినట్లు చెప్పారు. సెర్ప్ ద్వారా మంజూరయ్యే వ్యక్తిగత, గ్రూపు రుణాలను సద్వినియోగం చేసుకునేలా గ్రామసంఘాల ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. పుస్తక నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు, గ్రామ సంఘాల విధులు, బాధ్యతలపై సీఆర్‌పీలు రమాదేవి, రమ వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం దుర్గారావు, సీసీలు సంపత్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



చుంచుపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: రేపల్లెవాడ రైతు వేదికలో సీఎం సందేశాన్ని వింటున్న రైతులు



పాల్వంచ: అంబేద్కర్ సెంటర వద్ద మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

చుంచుపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా తొమ్మిది రోజుల్లో రూ.9 వేల కోట్లను విజయవంతంగా పంపిణీ చేసిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు మంగళవారం చుంచుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రామవరం రైతు వేదికలో సంబరాలు నిర్వహించారు. కోనేరు సత్యనారాయణ(చిన్ని) మాట్లాడుతూ.. ఎన్నికల హామీలో భాగంగా ప్రజా ప్రభుత్వంలో రైతు భరోసాపై ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అంతోటి పాల్, ముగితే కరుణాకర్, మాలోత్ లక్ష్మణ్, బోదాస్ కనకరాజు, అచ్చ నాగరాజు, మన్న వెంకటేశ్వర్లు, కుల్పత్ కిషన్, రావి రాంబాబు, కోనేరు నాగేశ్వరావు, భగవత్ సింగ్, మసూద్, రైతులు పాల్గొన్నారు.

పాల్వంచ: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం రైతు భరోసా నగదు పంపిణీ చేయడం పట్ల అంబేద్కర్ సెంటర్‌లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతు భరోసా సంబురాలు జరిపారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు తుమ్మల, పొంగులేటి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండం వెంకన్న, ఎస్ఏ.జలీల్, మహిపతి రామలింగం, బాలినేని నాగేశ్వరరావు, సాధం రామకృష్ణారావు, బాదర్ల జోషి, ఎస్వీఆర్‌కె.చారి, బద్ది కిషోర్, కనగాల నారాయణ, మధుసూదన్‌రావు, బాలు నాయక్, రాజశేఖర్, చాంద్ పాషా, పాబోలు నాగేశ్వరరావు, కోటి నాయక్, గిరి ప్రసాద్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పాతసూరారం గ్రామంలో మంగళవారం రైతు భరోసా సంబురాలు నిర్వహించారు. సీఓం, రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నునావత్ సుమన్‌నాయక్, కూరాకుల వెంకన్న, ఉడుగుల అశోక్, బొల్లా కృష్ణ, జక్కుల సైదులు, రమణబోయిన వీరయ్య, జక్కుల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: రైతు భరోసా పథకం అమలును హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సంబరాలకు వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ హాజరయ్యారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వరకు జరిగిన భారీ ప్రదర్శనలో రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇల్లెందు: ఏకకాలంలో రైతులందరికీ రైతు భరోసా కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల దీవెనలు ఉండాలని పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డా డానియేల్, పులి సైదులు అన్నారు. మంగళవారం ఇల్లెందు సత్యనారాయణపురం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కావటం పట్ల సంబురాలు నిర్వహించారు. ఆటో వెంకన్న, వారా రవి, వెంకన్న సార్, మున్నా, నాగిరెడ్డి, గాలిపల్లి స్వరూప, కమలమ్మ, మల్లేశ్వరి, కమల్‌కోరి, మేకల శ్యాం, అనసూర్య, పద్మ, స్వాతి, పడిదల నవీన్ పాల్గొన్నారు.

సీఎం సందేశాన్ని వీక్షించిన రైతులు

ఇల్లెందురూరల్: రేపల్లెవాడ, సుదిమళ్ల, కొమరారం రైతు వేదికల్లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని రైతులు వీక్షించారు. అనంతరం ఏర్పాటైన సమావేశంలో ఏఓ సతీష్ మాట్లాడుతూ.. రైతు భరోసా నిధులను వ్యవసాయ పెట్టుబడులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


రైతు భరోసా పేరుతో నిధులు విడుదల చేయడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పులి సైదులు, నేతలు యదళ్లపల్లి అనసూర్య, పాయం స్వాతి, కల్తి పద్మ, చాట్ల భాగ్యమ్మ, చీమల విజయ, తురక విజయ్, రుద్ర రామస్వామి, నవీన్, ప్రసన్నకుమార్, వెంకటేశ్వర్లు, పాయం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు నో చెప్పండి.. సమాజాన్ని కాపాడండి..

సింగరేణి(కొత్తగూడెం): డ్రగ్స్‌కు నో.. చెప్పి, సమాజాన్ని కాపాడాలని, మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజం కలిసి రావలని, ఇందులో విద్యార్థుల పాత్ర కీలకమని, కొత్తగూడెం టూ టౌన్ సీఐ ప్రతాప్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు సీఐ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడి యువత తమ మేధాశక్తిని వృథా చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ ఒకసారి వాడినా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తల్లితండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని త్రీటౌన్ సీఐ శివప్రసాద్ అన్నారు. మంగళవారం త్రీటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నార్కోటిక్‌పై యాంటీ డ్రగ్ సోల్జర్లు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ... ఈనెల 26వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1908, నేషనల్ టోల్ ఫ్రీ నంబర్ 14446 కాల్ చేయాలని సూచించారు.



పాల్వంచ: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

పాల్వంచ: యువత చెడు వ్యసానాలకు అలవాటు పడి, తమ విలువైన భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సజ్జన్ సమాజ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. యువత సమాజంలో బాధ్యతాయుతమైన పాత్ర వహించాలన్నారు. ఎంఏ.రజాక్, వినుకొండ శ్రీనివాసరాజు, ఖాజా హుస్సేన్, జానీ, హైమద్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, వీటిని అరికట్టేందుకు అందరూ భాగస్వాములు కావాలని పాల్వంచ సీఐ సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక అనుబోస్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ రేపటి భావిభారత పౌరులపై ఉందన్నారు. అనుమానాస్పదంగా కనిపిస్తే టోల్ ఫ్రీ నంబర్ 190కి సమాచారం అందించాలన్నారు. చైర్మన్ డాక్టర్ టి.భరత్ కృష్ణ, కరస్పాండెంట్ టి.అవని, డైరెక్టర్ ఎస్.సుబ్బారావు, ప్రిన్సిపాల్ బి.రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలవ్వొద్దు..

టేకులపల్లి: యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్ అన్నారు. ఎస్పీ రోహిత్ రాజు, ఇల్లెందు డీఎస్పీ చంద్రభానుల అదేశాల మేరకు మంగళవారం టేకులపల్లి పోలీసు స్టేషన్ ఆవరణలో యాంటి డ్రగ్స్ అవగాహన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు.